# ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్






హైదరాబాద్, జనవరి 24 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయమంతా ఫోన్ ట్యాపింగ్ కేసు చుట్టూ తిరుగుతోంది. సీపీ సజ్జనార్ నేతృత్వంలో రెండో సిట్ ఏర్పాటు తర్వాత విచారణ మరింత ఊపందుకుంది. ఇప్పటి వరకు అధికారులు, చిన్న లీడర్ల చుట్టూ సాగిన దర్యాప్తు ఇప్పుడు బీఆర్ఎస్‌లోని పెద్ద తలకాయల చుట్టూ నడుస్తోంది. మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించిన సిట్ తాజాగా ఈ కేసు దర్యాప్తులో బిగ్ ట్విస్ట్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో కీలక ఆధారాలు సేకరించిన సిట్ అధికారులు ఇక వాట్సాప్ కాల్స్ డేటాపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో వాట్సాప్ ద్వారా ఎవరెవరు ఎవరిని సంప్రదించారనే విషయంలో నిఘా పెట్టారనే కోణంలోనూ సిట్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సిట్ అధికారులు ఇంటర్నెట్ ప్రోటోకాల్ డివైజ్ రికార్డ్స్ కోసం ఇంటర్నెట్ ప్రొవైడర్లను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ కారణంగా చాలా మంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో పాటు పలువురు ఉన్నతాధికారులు నార్మల్ కాల్స్ మాట్లాడేందుకు సంకోచించారనేది బహిరంగ రహస్యమే. తమ ఫోన్లపై నిఘా ఉంచారనే కారణంతో తాము వాట్సాప్, ఫేస్ కాల్, సిగ్నల్ యాప్‌లలో సంభాషించుకోవాల్సి వస్తోందని పలువురు నేతలు బహిరంగంగానే ఆరోపణలు చేశారు. చాలా మంది సాధారణ ఫోన్ కాల్స్‌కు బదులు వాట్సాప్ వంటి యాప్స్ ద్వారా సమాచార మార్పిడి చేసుకుంటున్నారని పసిగట్టి ఆ దిశగా కూడా గత ప్రభుత్వంలోని పాలకులు, అధికారులు నిఘా పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 600 నంబర్లకు సంబంధించిన వాట్సాప్ కాల్స్‌పై నిఘా ఉంచారని తెలుస్తోంది. ఇదంతా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు కనుసన్నల్లోనే జరిగిందని, దీంతో ప్రభాకర్‌రావు ఎంత మందితో మాట్లాడారు? వారిలో రాజకీయ నేతలు ఎవరున్నారు? అనే దానిపై సిట్ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

# మసిబూసి మారేడు కాయ చేయకండి



హైదరాబాద్, జనవరి 24 (తీన్మార్ న్యూస్): బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా 'బీటింగ్ అరౌండ్ ద బుష్' లా ఏదో చెప్పి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మసిబూసి మారేడు కాయ చేశారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది నిజం. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్ మెన్ గా పాత్ర పోషించింది నిజం అన్నారు. శనివారం మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. 'భట్టి విక్రమార్కను నేను సూటిగా అడుగుతున్నా ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారు? శుక్రవారం నేను బయటపెట్టిన మరో కుంభకోణం సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా నేటి ప్రెస్ మీట్ లో మాట్లాడలేదు? నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు? అని ప్రశ్నించారు.

## మా మీదకు నెట్టితే నిజాలు అబద్ధాలు అయిపోవు:

సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బీఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేయడం వల్ల నిజాలు అబద్దాలు అయిపోవు, జరిగిన స్కాంలు, స్కీంలుగా మారిపోవని హరీశ్ రావు అన్నారు. సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు? అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేసినట్లు? అని నిలదీశారు. ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేశామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు అన్నారు. సైట్ విజిట్ అమలయ్యింది, నైనీ రద్దు జరిగింది అంటే.. స్కాం జరిగినట్లే కదా? అని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క గారు మీరంటే నాకు చాలా గౌరవం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జీ లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాశాను. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తాను అని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్ధం అన్నారు.

# నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం







మొదటి పేజీ తరువాయి

నిలిచిపోయింది. దాంతో అగ్ని ప్రమాదం జరిగిన చోట రెస్క్యూ చేయడం కష్టంగా మారింది. దాంతో పోలీసులు ఎవరూ ఎగ్జిబిషన్ సందర్శించే వారు తమ ప ర్యటనను వాయిదా వేసుకోవాలని నగరవాసులకు విజక్షప్తి చేశారు. కాగా, నాంపల్లిలోని ఓ ఫర్నీచర్ షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. నాలుగు అంతస్థుల భవనంలో భారీ ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఎనిమిది ఫైరింజన్లతో మంటలు ఆర్పుతున్నాయి. అయితే భవనంలో వాచ్ మెన్ కుటుంబంలోని ఇద్దరు పిల్లలతో అఖిల్, ప్రణీతతో పాటు మరో నలుగురు అగ్నిప్రమాదంలో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. దీంతో బాధితుల బంధువులు తీవ్ర అందోళన చెందుతున్నారు. ప్రమాదం జరిగిన స్థలం ఫర్నిచర్‌కు చెందినది కావడంతో భవనం సెల్లార్‌లో పెద్దఎత్తున ఫర్నీచర్ సామాగ్రి పెట్టి ఉంచారు. దీంతో సహాయక చర్యలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది రోబో ఫైర్ మిషన్ల ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నారు.




# ఇక వాహనాల రిజిస్ట్రేషన్ షోరూమ్‌లోనే




హైదరాబాద్, జనవరి 24 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ వాహనదారుల కోసం ఒక విప్లవాత్మక మార్పును అమల్లోకి తెచ్చింది. కొత్త వాహనం కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్ నంబర్ కోసం ఇకపై ఆర్టీఓ (RTO) కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. కొనుగోలు చేసిన షోరూమ్‌లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసే సరికొత్త విధానాన్ని ప్రభుత్వం నేటి నుండి అధికారికంగా ప్రారంభించింది.

## ప్రెస్ నోట్ లోని ముఖ్యాంశాలు:

- నేరుగా నంబర్ కేటాయింపు: వాహనం కొనుగోలు చేసిన వెంటనే, షోరూమ్ డీలర్లు ఆన్‌లైన్ ద్వారా రవాణా శాఖ పోర్టల్‌లో వివరాలను నమోదు చేస్తారు. అక్కడికక్కడే పర్మనెంట్ రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయించబడుతుంది.
- స్లాట్ బుకింగ్ అవసరం లేదు: గతంలో ఫోటోలు, వేలిముద్రల కోసం ఆర్టీఓ ఆఫీసులో స్లాట్ బుక్ చేసుకుని వెళ్లాల్సి ఉండేది. ఇప్పుడు ఆ అవసరం లేకుండా, షోరూమ్‌లోనే ఆధార్ ఆధారిత బయోమెట్రిక్/ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తి చేస్తారు.



- వ్యక్తిగత వాహనాలకు మాత్రమే: ఈ సదుపాయం ప్రస్తుతానికి కేవలం వ్యక్తిగత వినియోగ వాహనాలకు (Non-Transport Vehicles) అనగా టూ వీలర్స్ మరియు ఫోర్ వీలర్స్‌కు మాత్రమే వర్తిస్తుంది. కమర్షియల్ వాహనాలకు పాత పద్ధతే కొనసాగుతుంది.
- స్మార్ట్ కార్డ్ హోమ్ డెలివరీ: రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత, ఒరిజినల్ ఆర్సీ (RC) కార్డును నేరుగా వాహనదారుడి ఇంటి చిరునామాకే పోస్ట్ ద్వారా పంపడం జరుగుతుంది.

## ప్రభుత్వ లక్ష్యం:

ఆర్టీఓ కార్యాలయాల్లో రద్దీని తగ్గించడం, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా సేవలు అందించడం మరియు వాహనదారులకు సమయం ఆదా చేయడం ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని రవాణా శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

గమనిక: ఫ్యాన్సీ నంబర్లు కోరుకునే వారు మాత్రం పాత పద్ధతిలోనే ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. సాధారణ నంబర్లకు మాత్రమే షోరూమ్ రిజిస్ట్రేషన్ వర్తిస్తుంది.

# రాష్ట్ర అభివృద్ధిలో బాలికలే కీలకం



హైదరాబాద్, జనవరి 24 (తీన్మార్ న్యూస్): జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బాలికల సాధికారతతోనే ప్రగతిశీల తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన ఆకాంక్షించారు. దేశ భవిష్యత్తు, సమగ్ర తెలంగాణ నిర్మాణంలో బాలికల పాత్ర అత్యంత కీలకమని, వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ప్రతి బాలికకు నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, పూర్తి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం వివరించారు. ఆడబిడ్డలు ఆత్మవిశ్వాసంతో ఎదిగి, నాయకత్వ బాధ్యతలు చేపట్టేలా తగిన అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 లక్ష్యానికి అనుగుణంగా, ప్రతి బాలిక తనలోని సంపూర్ణ సామర్థ్యాన్ని వెలికితీసి, రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో క్రియాశీలక భాగస్వామి కావాలని ఆయన కోరారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించే విషయంలో సమాజంలోని ప్రతి పౌరుడు కృషి చేయాలని, వివక్ష లేని సమాజాన్ని నిర్మించాలని సీఎం పిలుపునిచ్చారు. ఆడబిడ్డల భవిష్యత్తును బంగారుమయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# పిల్లలు తప్పిపోకుండా "క్యూఆర్ కోడ్ రిస్ట్ బ్యాండ్లు"

మొదటి పేజీ తరువాయి




అధికారులు నిర్ణయించారు. దీనికోసం చిల్డ్రన్ ట్రాకింగ్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ను డీజీపీ శివధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ బ్యాండ్ కు ఓ క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. ఒకవేళ చిన్నపిల్లలు తప్పిపోయినట్లయితే క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే వారి తల్లి దండ్రులకు సంబంధించిన పూర్తి వివరాలు వస్తాయి. కాబట్టి చిన్నారులు తప్పిపోయినా కంగారు పడకుండా వెంటనే గుర్తించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. జనవరి 28 నుండి 31వ తేదీ వరకు 11 కేంద్రాల్లో ఈ బ్యాండ్లను పంపిణీ చేయనున్నారు. వీటిని హన్మకొండ, కరీంనగర్, మంథని, ఉప్పల్, పరకాల, ఏటూరునాగారం. ఎంజీబీఎస్,పెద్దపల్లి,కాటరం బస్టాండ్లు, వరంగల్, కాజీపేట్ రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేయనున్నారు. పంపిణీ కేంద్రాల వద్దనే సంరక్షుల సమాచారం తీసుకుంటారు. దీని కోసం మొత్తం 25వేల రిస్ట్ బ్యాండ్లను అందుబాటులో ఉంచారు.

# ఫోన్ ట్యాపింగ్ విచారణ "అంతా ఒక డ్రామా"

హైదరాబాద్, జనవరి 24 (తీన్మార్ న్యూస్): ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో చేస్తున్న డ్రామాలతో రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలవుతోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌తో అందరి కొంపలు ముంచిన కేటీఆర్‌ను సాక్షిగా విచారణకు పిలిచి వాంగ్మూలం తీసుకోవడమే విడ్డూరంగా ఉందన్నారు. ఫాంహౌస్‌కు, ఏఐసీసీకి మధ్య డీల్ కుదిరేదాకా ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో డ్రామాలు కొనసాగిస్తారని అన్నారు. శనివారం హకీంపేటలో ఆయన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై మీడియాతో మాట్లాడుతూ సమర్థవంతమైన, నిజాయితీవంతులైన అధికారులు సిట్‌లో ఉన్నారని చెప్పిన బండి సంజయ్, వారిని స్వేచ్ఛగా పని చేయనీయకుండా రాష్ట్ర ప్రభుత్వం అజమాయిషీ చేస్తుందని అన్నారు. తాము చెప్పినట్లుగా విచారణ జరగాలని అధికారులపై బెదిరింపులకు పాల్పడుతోందని అన్నారు. ప్రజలు ఫోన్ ట్యాపింగ్ విచారణను చూసి నవ్వుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత తేటతెల్లమవుతోందని బండి సంజయ్ విమర్శించారు. ఇక రాష్ట్రంలో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అల్లాడుతున్నారని, ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బండి విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి, కేంద్రం నిర్వహిస్తున్న ఉద్యోగాల భర్తీకి ఉన్న తేడాను గమనించాలని కోరారు. టీజీపీఎస్సీ అంటేనే లీకేజీలు, పైరవీలు, కోర్టు కేసులని అన్నారు. ఆందోళనలు, ధర్నాలతో ఏళ్ల తరబడి పరీక్షలు, నియామకాలు సాగుతున్నాయని కామెంట్ చేశారు. కానీ, మోదీ ప్రభుత్వం ఒక్క పైరవీకి, అవినీతికి, లీకేజీలకు ఆస్కారం లేకుండా జాబ్ క్యాలెండర్ ఇచ్చి క్రమం తప్పకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేసినా చేయకపోయినా నిరుద్యోగులెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం క్రమం తప్పకుండా ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలతో నిరుద్యోగులు తమ కాళ్లపై తాము నిలబడుతూ పది మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదుగుతున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు.

# టీ-హబ్ స్టార్టప్‌లకే పరిమితం

మొదటి పేజీ తరువాయి

సర్కార్ వ్యవహ రిస్తోందని, అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను టీ-హబ్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖండించారు. టీ-హబ్‌ను స్టార్టప్ కేంద్రంగా కొనసాగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ విషయం గురించి అమెరికా పర్యటనలో ఉన్న సీఎం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ఫోన్ చేసి మాట్లాడారు. టీ-హబ్‌ను ప్రత్యేక స్టార్టప్‌ల కేంద్రంగానే గుర్తించాలని చెప్పారు. ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్ క్యాటలిస్ట్‌గా స్టార్టప్‌లకు కేంద్రంగా ఏర్పాటు చేసిన టీ-హబ్‌లో ఇతర ఆఫీసులు ఉండకూడదని, అలాంటి ఆలోచనలుంటే వెంటనే విరమించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు.



# రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు



భూపాలపల్లి, జనవరి 24 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం--2025-26 కింద 50 శాతం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార, జౌళి, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాలులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి జె. బాపు రావు, ఉద్యాన అధికారి సునీల్ తో కలిసి లబ్ధిదారులైన రైతులకు 66 లక్షల విలువ గల వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ ద్వారా రైతులపై శ్రమ భారం తగ్గడంతో పాటు సాగు ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకే రాయితీలతో ఆధునిక యంత్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డివిజన్ ఏడీఏ ఎన్. రమేష్, మహాదేవపూర్ డివిజన్ ఏడీఏ శ్రీపాల్, జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు, రైతులు, యంత్ర పరికరాల సరఫరాదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం



మహబూబాబాద్, జనవరి 24 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, మహబూబాబాద్ నిరంతరం సేవలు అందిస్తున్నదని జిల్లా ఉపాధి అధికారిణి టి. రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో వెలువడే ఉద్యోగ అవకాశాల సమాచారం సక్రమంగా నిరుద్యోగులకు చేరవేయడానికి ఎంప్లాయిమెంట్ కార్యాలయం కీలక పాత్ర పోషిస్తున్నదని ఆమె పేర్కొన్నారు. వివిధ శాఖల నుండి వచ్చే నోటిఫికేషన్లు, ఉద్యోగ అవకాశాల సమాచారాన్ని అభ్యర్థులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారిణి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి నిరుద్యోగి తప్పనిసరిగా ఎంప్లాయిమెంట్ కార్డును పొంది ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఒకసారి నమోదు చేసుకుంటే జీవితాంతం వర్తించే శాశ్వత ఎంప్లాయిమెంట్ కార్డు జారీ చేస్తున్నామని, గతంలో మాదిరిగా మూడు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ అవసరం లేదని స్పష్టం చేశారు. నిరుద్యోగులు తమకు సమీపంలోని ఏదైనా నెట్ సెంటర్ ద్వారా ఞఞ.వఎ-జూశ్రీశీఎవఞ.వశ్రీఞఅస్త్రుఞఞ.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ లో ఆన్లైన్ దరఖాస్తు చేసుకుని శాశ్వత ఎంప్లాయిమెంట్ కార్డును పొందవచ్చని తెలిపారు. అలాగే, ఆన్లైన్లో నమోదు చేసుకోలేని వారు జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయాన్ని నేరుగా సంప్రదిస్తే సిబ్బంది సహకారంతో అదే రోజున ఎంప్లాయిమెంట్ కార్డు జారీ చేయబడుతుందని పేర్కొన్నారు. జిల్లా ఎంప్లాయ్మెంట్ కార్యాలయంలో ఉద్యోగ సమాచారంతో పాటు కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్, స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించిన సమాచారాన్ని కూడా అందిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా జిల్లాలోని యువత తమ భవిష్యత్తును సక్రమంగా ప్రణాళిక చేసుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో తమ పేరు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారివిజ్ఞప్తి చేశారు.

**విదేశీ ఉద్యోగ నియామకాలు :**

ఞాఏీజాఏీ: తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఞాఏీజాఏీ (ఒవశ్రీఞఅస్త్రుఞఞ ాజవతీంఞుం మీఞఅజూశీఞవతీ జశీఎజుఞఅఎ ాఱఅఎఖ్వఎ) ద్వారా ఖతార్ దేశంలో వివిధ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నట్లువ తెలిపారు. ఖతార్ లోని ప్రతిష్టాత్మకంగా సంస్థలలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, సివిల్ ఇంజనీర్లు, క్యాస్టింగ్ ఇంజనీర్లు, సివిల్ ఇంజనీరింగ్ తో సివిల్ సూపర్వైజర్ గా పని చేయుటకు అర్హత కలిగిన అభ్యర్థులకు మంచి అవకాశం కల్పించబడుతున్నదని అన్నారు. ఈనియామకాలు పూర్తిగా ప్రభుత్వ పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించబడతాయని అధికారి ఈ సందర్భంగా తెలిపారు. మరిన్ని వివరాలకు www.tomcom.telangana.gov.in లేదా 9440049013, 9440050951, 9440051452 ద్వారా సంప్రదించి వివరాలు పొందవచ్చనని అన్నారు.

# ముండ్రాతి సమ్మయ్యను పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి



హనుమకొండ, జనవరి 24 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం దామెర మండలం పులుకుర్తి గ్రామ బిఆర్ఎస్ నాయకులు ముండ్రాతి సమ్మయ్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సమ్మయ్య కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేడారంలో తాత్కాలిక ఆర్.టి.సి. బస్టాండ్ ప్రారంభం

## భక్తులు, ప్రజలకు శాశ్వత రవాణా సౌకర్యాలే లక్ష్యం

## రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





తాడ్వాయి, జనవరి 24 (తీన్మార్ న్యూస్): మహాజాతర--2026 ఏర్పాట్లలో భాగంగా మేడారంలో రవాణా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను ప్రకటిస్తూ, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మేడారాన్ని సందర్శించి తాత్కాలిక ఆర్.టి.సి. బస్టాండ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మేడారం జాతరకు భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో 4,000 ఆర్.టి. సి. బస్సులను ప్రణాళికబద్ధంగా నడుపుతున్నామని, అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులు కూడా వెంటనే పెంచే విధంగా శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఈ ఏర్పాట్ల కోసం రవాణా శాఖ తరపున వందలాది మంది అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి, జాతర ప్రయాణ సేవలను అధికారికంగా ప్రారంభించినట్లు తెలిపారు. జాతర ప్రయాణ సేవలు జనవరి 20 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిరంతరంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఈ కాలవ్యవధిలో ప్రయాణికులకు రవాణా సేవలతో పాటు భద్రత, ఆరోగ్య సహాయం వంటి అంశాల్లో కూడా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సహా ఆర్టీసీ ఉన్నతాధికారులు జాతర విజయవంతానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భక్తులు తమ ప్రయాణాన్ని సురక్షితంగా, సౌకర్యవంతంగా పూర్తి చేసుకోవాలంటే తప్పనిసరిగా ఆర్టీసీ బస్సులనే వినియోగించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. స్వంత వాహనాలతో వస్తే దూరంగా పార్కింగ్, ఎక్కువ నడక వంటి ఇబ్బందులు తప్పవని, ఆర్టీసీ బస్సులు గద్దెలకు సమీపంలోనే దించుతాయని తెలిపారు. ఆర్టీసీ ప్రయాణం భద్రతాపరంగా మరింత నమ్మదగినదని అన్నారు. జాతర సమయంలో చిన్న పిల్లలు తప్పిపోయే ఘటనలను నివారించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న చైల్డ్ ట్రాకింగ్ సిస్టమ్‌ను ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని మంత్రులు కోరారు. ఈ విధానం ద్వారా తప్పిపోయిన పిల్లలను వేగంగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, 2024లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం జాతరకు రవాణా మౌలిక వసతులు కల్పించాలనే దూరదృష్టితో ముందడుగు వేశారని గుర్తు చేశారు. ప్రతి జాతర సమయంలో తాత్కాలిక ఏర్పాట్లతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, దీర్ఘకాలిక పరిష్కారంగా శాశ్వత ఆర్.టి.సి. బస్టాండ్‌ను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఏడాది జాతర సందర్భంగా అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయడమే కాకుండా, ఈసారి మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా మేడారానికి వచ్చి రవాణా ఏర్పాట్లను పరిశీలించారని, ఇందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు, ప్రయాణికులు ఎలాంటి అసౌకర్యాలు ఎదుర్కోకుండా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ములుగు జిల్లాలో సంవత్సరాల తరబడి బస్ డిపో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వెంటనే స్పందించి దాదాపు రూ.5 కోట్ల వ్యయంతో శాశ్వత బస్‌డిపో ను మంజూరు చేసినందుకు రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంత్రి సీతక్క ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బస్ డిపో అంశంపై మంత్రి సీతక్క వివరిస్తూ, రూ.7 కోట్ల వ్యయంతో ఏటూరునాగారంలో ఆర్టీసీ బస్ డిపోను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఏటూరునాగారంలో డిపో ఏర్పాటు చేస్తే అటవీ ప్రాంతాలు, భద్రాచలం, మంగపేట, వాజేడు, వెంకటాపురం వంటి ప్రాంతాలన్నీ సమగ్రంగా కవర్ అవుతాయని స్పష్టం చేశారు. అందుకే ఏటూరునాగారమే అనుకూల ప్రాంతమని సూచించగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. అలాగే మంగపేట, ములుగు తదితర మండలాల్లో మినీ బస్‌స్టేషన్లను కూడా మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. రాబోయే రోజుల్లో బీసీ సంక్షేమ శాఖ ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా మేడారం అభివృద్ధి మేడారం జాతర ఏర్పాట్లలో భాగంగా చేపడుతున్న నిర్మాణాలు, షెడ్లు, క్యూ లైన్ల రూపకల్పన పూర్తిగా మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా సాగుతున్నాయని మంత్రి తెలిపారు. జాతర సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లను ప్రస్తుతం వినియోగంలోకి తీసుకువస్తున్నామని, అయితే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటిని తిరిగి అమర్చుకునేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. గద్దెల ప్రాంగణాన్ని విస్తృతంగా అభివృద్ధి చేసే దిశగా మాస్టర్ ప్లాన్ రూపొందించామని, జాతర అనంతరం అవసరమైతే కొన్ని షెడ్లను తొలగించి మరింత అనుకూలమైన ప్రాంతాల్లో తిరిగి ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం షెడ్ల నిర్మాణాన్ని బోల్టు, నట్లు ఉపయోగించే విధంగా రూపొందించామని, తద్వారా భవిష్యత్తులో సులభంగా మార్పులు చేసుకునే వీలుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ, ఏటూరు నాగారం ప్రాంతంలో ఆర్టీసీ డిపో మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అటవీ ప్రాంతం కావడంతో ఇక్కడి నుంచి భద్రాచలం సహా ఇతర ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు పరిమితంగా ఉండేవని, ఆర్టీసీ డిపో ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు, భక్తులకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. అలాగే మేడారం ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నం దుకు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ సంస్థ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం రాష్ట్రంలో ఒక చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొంటూ, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో మహిళలకు, గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు పెరగాలని ఆకాంక్షించారు.




# గుడ్ మార్నింగ్ భూపాలపల్లి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే





## సమస్యల వలయంగా భూపాలపల్లి

## సొంత ఖర్చులతో సుభాష్ కాలనీ ఓపెన్ జిమ్ మరమ్మత్తు

## మా డబుల్ బెడ్ రూమ్ అమ్ముకున్నారంటూ బాధితుల మొర

భూపాలపల్లి, జనవరి 24 (తీన్మార్ న్యూస్): గుడ్ మార్నింగ్ భూపాలపల్లి కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ కాలనీలోని జయశంకర్ పార్క్ లో వాకింగ్ చేస్తూ ప్రతి ఒక్కర్ని ఆప్యాయంగా పలకరించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మరియు వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్, భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి. ఈ సందర్భంగా న్యూ సుభాష్ కాలనీ, సుభాష్ కాలనీ లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్క్ లో గల ఓపెన్ జిమ్ సెంటర్ ను పరిశీలించి నిరుపయోగంగా మారిన ఓపెన్ జిమ్ ను రిపేర్ చేయించి ప్రజలకు అదేవిధంగా మార్నింగ్ వాకర్స్ కు అందుబాటులోకి తీసుకురావాలని జిఎంకి ఫోన్ కాల్ ద్వారా కోరడం జరిగింది. వారు మా పరిధిలో లేదు అని తెలపడంతో సొంత ఖర్చులతో మరమ్మత్తు చేయించి ఉపయోగంలోకి తీసుకొస్తానని తెలిపారు.

అనంతరం 29వ వార్డులో పర్యటిస్తూ వార్డులో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గతంలో అధికారంలో ఉన్నప్పుడు సాంక్షన్ చేయించిన ఇండోర్ స్టేడియాన్ని, స్విమ్మింగ్ పూల్ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. వారితోపాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, టీబీజీకేఎస్ సింగరేణి నాయకులు పాల్గొన్నారు.

# నామినీలకు ఊరట

## "పీఎఫ్, ఇన్సూరెన్స్ క్లెయిమ్స్‌పై"

## సుప్రీంకోర్టు సంచలన తీర్పు





న్యూ ఢిల్లీ, జనవరి 24 (తీన్మార్ న్యూస్ ): పీఎఫ్, ఇన్సూరెన్స్ క్లెయిమ్స్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. చనిపోయిన వ్యక్తికి సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్స్, ఇతర బ్యాంకు బకాయిలను పొందేందుకు నామినీలు ఇకపై కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ పరేష్ చంద్ర మండల్' కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. ఈ పిటిషన్ పై పూర్తి వాదనలు విన్న తర్వాత నామినీ వివరాలు స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు కచ్చితంగా "సక్సెషన్ సర్టిఫికెట్" సమర్పించాలని ఒత్తిడి చేయకూడదని కోర్టు ఆదేశించింది. నామినేషన్ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమే కుటుంబానికి ఆర్థిక సహాయం త్వరగా అందేలా చూడటమని, కోర్టు సర్టిఫికేట్లు (వారసత్వ ధృవీకరణ పత్రం) అడగడం వల్ల ఆ ఉద్దేశమే దెబ్బతింటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే, నామినీకి డబ్బులు అందినంత మాత్రాన వారే పూర్తి యజమాని కారని, ఇతర చట్టబద్ధమైన వారసులు ఎవరైనా ఉంటే వారు తమ వాటా కోసం నామినీపై సివిల్ కోర్టులో క్లెయిమ్ చేసుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ బాధ్యత కేవలం నామినీకి నిధులు విడుదల చేయడమేనని, ఆ తర్వాత వారసత్వ వివాదాలు ఉంటే అవి సివిల్ చట్టాల ప్రకారం తేల్చుకోవాలని సుప్రీంకోర్టు వివరించింది.

**ముఖ్యమైన వివరాలు**

- ఈ తీర్పుతో నామినీ పేరు ఉంటే బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు సక్సెషన్ సర్టిఫికెట్ అడగలేవు.
- కోర్టు నిర్ణయంతో మరణించిన వారి ఆశ్రితులకు డబ్బులు త్వరగా అందుతాయి.
- డబ్బులు నామినీకి అందకపోయినా, చట్టబద్ధమైన వారసులకు వాటి పై హక్కు ఉంటుంది.

# మద్యం మత్తులో కాంగ్రెస్ గుండాల అరాచకం

## సాక్షాత్తు మంత్రి సీతక్క సమక్షంలో ఎమ్మెల్యేపై దాడి

## శంకుస్థాపనల వద్ద కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేయాలి

## కేటీఆర్ ఘాటు విమర్శలు

## ఘటనపై కేటీర్ ఘాటు వాఖ్యలు





హైదరాబాద్, జనవరి 24 (తీన్మార్ న్యూస్): ఓవైపు ముఖ్యమంత్రి అధికార మత్తులో విదేశాల్లో జల్సాలు చేస్తుంటే కింద కాంగ్రెస్ గుండాలు మద్యం మత్తులో వీర్రవీగుతూ విధ్వంసం సృష్టిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శుక్రవారం మంత్రి సీతక్క హాజరైన కార్యక్రమలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై జరిగిన దాడి ఘటనను ఆయన ఖండించారు. సాక్షాత్తూ రాష్ట్ర మంత్రి సీతక్క సమక్షంలోనే పట్టపగలు కొందరు కాంగ్రెస్ గుండాలు తాగొచ్చి వీధిరౌడీల్లా వ్యవహరించడం తెలంగాణలో దిగజారిన శాంతిభద్రతలకు అద్దంపడుతోందని మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేసిన కేటీఆర్ అధికారికంగా జరిగే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వద్ద కూడా "డ్రంక్ అండ్ డ్రైవ్" టెస్టులు పెట్టాల్సిన దుస్థితి తెలంగాణలో నెలకొని ఉందన్నారు.

### ఫ్యాక్షన్ సంస్కృతిని ఈ గడ్డ సహించదు:

ముఖ్యమంత్రే స్వయంగా నేరాలను పెంచి పోషించేలా ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో లా అండ్ ఆర్డర్‌ను తీవ్రంగా దెబ్బతీసే సంఘటనలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ పార్టీతోపాటు తెలంగాణ సమాజం కూడా ఈ గడ్డపై ఇలాంటి ఫ్యాక్షన్ సంస్కృతిని ఎట్టిపరిస్థితుల్లో సహించదన్నారు. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రుగాల్చి వాతపెట్టిందని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రికి, అధికార పార్టీ అరాచక పర్వానికి తెలంగాణ ప్రజలు తప్పకుండా సరైన గుణపాఠం చెబుతారన్నారు.

# కంటోన్మెంట్ విలీన పోరు

## ఎమ్మెల్యే గణేష్ దీక్షకు మంత్రి పొన్నం మద్దతు

## కేంద్ర మంత్రులకు లేఖల అస్త్రం

## కిషన్ రెడ్డి, బండి సంజయ్ వెంటనే చొరవ చూపాలి



హైదరాబాద్, జనవరి 24 (తీన్మార్ న్యూస్): కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేస్తున్న దీక్షకు మద్దతు తెలుపుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంటోన్మెంట్ విలీనానికి సంబంధించి కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు లేఖలు రాస్తూ వెంటనే విలీనానికి సంబంధించిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి సమానంగా జరగాలని కంటోన్మెంట్ పేరుతో జరుగుతున్న వివక్ష పై చేస్తున్న దీక్షకు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం త్వరగా తీసుకోవాలని కంటోన్మెంట్ ప్రజల సమస్యలు తీర్చేలా విలీనం త్వరగా జరపాలని తెలంగాణ ప్రభుత్వం పక్షాన కోరారు.

# కేటీఆర్ మాటలు మతిలేనివి

## బట్ట కాల్చి మీద వేయడమే ప్రతిపక్షం పని

## మున్సిపల్ ఎన్నికలే మాకు రిఫరెండం

## మంత్రి పొంగులేటి ధ్వజం

హైదరాబాద్, జనవరి 24 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి పైన కేటీఆర్ మాట్లాడుతున్న భాష సరిగా లేదని, మతి లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు వ్యక్తిగతంగా తాను రిఫరెండంగా భావిస్తున్నానని అన్నారు. ఇప్పటికే రెండు సార్లు కేటీఆర్ రిఫరెండం అన్నారు. మళ్లీ ఇప్పుడు రిఫరెండం అంటున్నారు. ఇంతకు ముందు జరిగిందే ఈ ఎన్నికల్లో జరుగుతుందన్నారు. ఆనాడు సోయి లేకుండా ఇష్టం వచ్చినట్లు జిల్లాలను ఏర్పాటు చేసి, ఇప్పుడు అగ్నిగుండం చేస్తామని మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో ప్రజామోదంతో జిల్లాలను పునర్వ్యవస్థీకరణ చేస్తామన్నారు. బట్ట కాల్చి మీద వేయడమే ప్రతి పక్ష పార్టీ పని అన్నట్లుగా వ్యవహరిస్తోందన్నారు. తమ రెండేళ్ల పాలనలో ఏ తప్పు జరిగిందని మాట్లాడుతున్నారు. వారి పాలనలో అక్రమాలు జరిగినట్లుగానే ఇప్పుడు కూడా అలాగే జరుగుతున్నాయని భ్రమపడుతున్నారు. ఇంకా అధికారంలో ఉన్నట్లుగా వారి వ్యవహార శైలి ఉందన్నారు. అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని చిట్ చాట్‌లో అన్నారు.



# ఘనంగా.. గణతంత్ర దినోత్సవం

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, జనవరి 24 (తీన్మార్ న్యూస్): ఈ నెల 26 న భారత గణ తంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాట్లు త్వరగా పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వేడుకలు జరిగే ధర్మ కంచ స్టేడియంని శనివారం అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రోటోకల్ ప్రకారం గా డయాస్ ఏర్పాట్లు, వివిధ రకాల పూలతో అందంగా ముస్తాబు, వివిధ విభాగలుగా సీటింగ్ గ్యాలరీ లు,మైదానం అంత పరిశుభ్రం గా పెట్టడం, బారికేడ్ ల ఏర్పాటు, తాగునీరు వసతి, అంబులెన్స్, ఫైర్ వాహనం మొదలగు అంశాల మీద సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమం లో ఏసీపీ పండరి చేతన్, ఆర్డీవో గోపి రాం, పీడీ వసంత, మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బి, విద్య, మెడికల్, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సీ స్టడీ సర్కిల్ శిక్షణ కరపత్రాల ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



వరంగల్ జిల్లా, జనవరి 24 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా వివిధ ఉద్యోగాలకు అందిస్తున్న ఉచిత శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిసిపి అంకిత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్పేయి చేతుల మీదుగా ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ నిరుద్యోగులకు రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలతో పాటు ఆర్.ఆర్.బి, బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) వంటి వివిధ పోటీ పరీక్షలకు ఎస్సీ స్టడీ సర్కిల్ హనుమకొండ కేంద్రంలో ఐదు నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షల వరకు ఉన్న అభ్యర్థులు http://tsstudycircle.co.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు 08-02-2026 (ఆదివారం) హనుమకొండలో ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ఉచిత శిక్షణ కల్పిస్తామని చెప్పారు. ఈ సదావకాశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి (డీఎస్సీడీవో), ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కె. జగన్ మోహన్, ఆర్డీవోలు వరంగల్, నర్సంపేట సుమ, ఉమా రాణిలు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రవల్లిలో కేసీఆర్ కీలక భేటీ



మొదటి పేజీ తరువాయి

తెలుస్తుంది. ఈ భేటీలో రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలు, ప్రధానంగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ పురోగతిపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో జరుగుతున్న పరిణామాలను, అధికారుల విచారణ తీరును కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. చట్టపరంగా ఈ అంశాన్ని ఎలా ఎదుర్కోవాలనే దానిపై నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో రాబోయే మున్సిపల్ ఎన్నికలపై కేసీఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయిలో సన్నద్ధం చేయాలని నేతలకు సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ కేడర్‌లో ధైర్యం నింపేలా కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు పార్టీ భవిష్యత్తుకు కీలకమని, అందరూ సమన్వయంతో పనిచేసి గెలుపు దిశగా అడుగులు వేయాలని ఈ భేటీలో నిర్ణయించినట్లు తెలుస్తుంది.

# సింగరేణి టెండర్లపై విచారణకు సిద్ధం




హైదరాబాద్, జనవరి 24 (తీన్మార్ న్యూస్): సింగరేణి టెండర్లపై తాము విచారణకు సిద్ధమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఆయన ప్రజాభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సింగరేణి టెండర్లపై వస్తున్న ఆరోపణలను ఎదుర్కోవడానికి సిద్ధమని, 2014 నుంచి నిర్వహించిన టెండర్లపై విచారణ చేయిద్దామని హరీశ్ రావుకు సవాల్ విసిరారు. టెండర్లపై సమగ్ర విచారణ కావాలంటే హరీశ్ రావు తనకే నేరుగా లేఖ రాయవచ్చని ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా నుంచి రాగానే విచారణ కోరుతామని స్పష్టం చేశారు.

### చేసేదంతా మీ వాళ్లే.. మాపై లేఖలా హరీశ్!

దేశంలో ఏ మైనింగ్ యాక్టివిటీలోనూ డీజిల్ సప్లై చేసే పరిస్థితి లేదని, కానీ, 2022 నైనీ బ్లాక్ టెండర్లలో డీజిల్ విధానాన్ని మార్చారని ఆరోపించారు. సింగరేణిలో 25 టెండర్లలో 20 బీఆర్ఎస్ హయాంలో, 5 తమ ప్రభుత్వ హయాంలో జరిగాయన్నారు. సోదా కన్[illegible]స్ట్రక్షన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ బీఆర్ఎస్ నేత కందాల ఉపేందర్ రెడ్డి అల్లుడు సృజన్ రెడ్డిది అని తెలిపారు. ఆ కంపెనీ ఎండీ ఆయన కూతురు దీప్తి రెడ్డి అని పేర్కొన్నారు. ఇందులో అంతా హరీశ్ రావు పార్టీకి చెందిన వాళ్లే ఉంటే, మాపై లేఖలు రాయడం ఏంటని భట్టి ప్రశ్నించారు.

### సింగరేణి బొగ్గు బావులపై ఏ గద్దనూ వాలనివ్వను

వాస్తవాలు తెలుసుకోకుండా అడ్డగోలుగా ఏది పడితే అది రాస్తే సాగదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హెచ్చరించారు. తాను రాజకీయాల్లోకి ఆస్తులు సంపాదించుకునేందుకు రాలేదని, సమాజంలో మార్పు కోసమే వచ్చానని అన్నారు. తాను చేపట్టిన పాదయాత్ర సమయంలో కూడా సింగరేణి కోసం పోరాడానని గుర్తు చేశారు. సింగరేణిపై ఏ గద్దనూ వాలనివ్వనని బొగ్గు బావులు తెలంగాణకు ఎంత అవసరమో తనకు తెలుసని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

# ప్రయాణికులకు గుడ్ న్యూస్




సికింద్రాబాద్, జనవరి 24 (తీన్మార్ న్యూస్): ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే కీలక అప్ డేట్ ఇచ్చింది. వీక్లీ స్పెషల్ రైళ్ల సేవలను మరికొన్ని రోజులు పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. కాచిగూడ–మధురై, హైదరాబాద్–కొల్లం, హైదరాబాద్–కన్యాకుమారి, నరసాపూర్–తిరువణ్ణామలై మార్గాల్లో ఈ ప్రత్యేక రైళ్లు ఫిబ్రవరి 2026 వరకు నడుపుతున్నట్లు స్పష్టం చేసింది. ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ సేవలను పొడిగించడం వల్ల వెయిటింగ్ లిస్ట్ సమస్య కొంత తగ్గుతుందని భావించింది.

### ఇంకా కొనగుతున్న రద్దీ

సంక్రాంతి ముగిసినప్పటికీ ప్రయాణికుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఇంకా స్వగ్రామాల నుంచి నగరాలకు ప్రయాణికులు తిరిగి వస్తున్నారు. ఉద్యోగాలు, చదువుల కోసం దూరప్రాంతాలకు వెళ్లే వారు సైతం ఎక్కువగా ఉంటున్నారు. దీంతో రైళ్లలో తీవ్ర రద్దీ నెలకొంది. మరోవైపు టిక్కెట్లు సైతం దొరకని పరిస్థితి ఉంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని వీక్లీ స్పెషల్ రైళ్ల సేవల పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది.

# 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

### 27న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని పరభుత్వం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాలకు ముందు సంప్రదాయం ప్రకారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 27వ తేదీన పార్లమెంట్‌లోని మెయిన్ కమిటీ రూమ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో చేపట్టనున్న లెజిస్లేటివ్, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. జనవరి 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. జనవరి 28తో ప్రారంభమయ్యే తొలి విడత బ్జడెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. రెండో విడత బ్జడెట్ సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తాయి. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు కేంద్ర బ్జడెట్ 2026–27ను ఉభయసభల్లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. సీతారామన్ వరుసగా ప్రవేశపెడుతున్న తొమ్మిదవ బ్జడెట్ ఇది. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకూ రాష్ట్రపతి బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఉంటుంది. దీనితో పాటు వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు–2025, ది సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్–2025, రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు–2024పై సభలో చర్చ ఉంటుంది. ఈ బిల్లులను తదుపరి పరిశీలన కోసం పార్లమెంటరీ స్థాయీ సంఘానికి లేదా సెలెక్ట్ కమిటీలకు పంపనున్నారు.

# భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది






**దేశవ్యాప్తంగా 18వ రోజ్‌గార్ మేళా**

**ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి**

**యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ**

**వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి**

**61,000 మందికి నియామక పత్రాలు అందించిన మోడీ**

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా శనివారం జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రిత్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా నియమితులవు తున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు. బీఎస్ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాండెంట్ నాయకత్వం వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.

# అమెరికాను కుదిపేస్తున్న మంచు తుఫాన్

### ఎమర్జెన్సీ ప్రకటించిన పలు రాష్ట్రాలు.. 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు వెల్లడి



**వాషింగ్టన్ :** అమెరికాను భారీ మంచు తుపాను తాకింది. దీంతో పలు రాష్ట్రాల్లో భారీస్థాయిలో మంచు, వర్షంతోపాటు అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం టెక్సాస్, ఓక్లహోమాపై మంచు తుపాను పంజా విసురుతోంది. మంచు తుపాను కారణంగా అమెరికాలోని 20 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రభావితం కానున్నట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఈ భీకర తుపాను కారణంగా పలు రాష్ట్రాల్లో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. శనివారం నాటి 3,200 విమాన సర్వీసులు, ఆదివారం నాటి 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు సైలట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. మున్ముందు ఈ పరిస్థితి మరింత తీవ్రతరమయ్యే అవకాశం ఉండడంతో పెద్దసంఖ్యలో రవాణా సర్వీసులకు అంతరాయం కలగొచ్చని అంచనా వేసింది. వాతావరణ హెచ్చరికలతో అమెరికాలోని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కెంటకీ, వర్జీనియా, కాన్సస్, ఆర్కాన్సాస్, జార్జియా, మిసిసిపి సహా పలు రాష్ట్రాలు ఎమర్జెన్సీ విధించాయి. మిసిసిపి, ఫ్లోరిడా వంటి దక్షిణాది రాష్ట్రాల్లోనూ ప్రమాదకర చలి వాతావరణం ఉంటుందని.. మిస్సోరి, ఇల్లినోయీలలోనూ భారీ మంచు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

ప్రతికూల వాతావరణం కారణంగా అనేక ప్రాంతాల్లో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడనుందని, వాహనదారులు మంచులోనే చిక్కుకుపోయే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఇది ఈ దశాబ్దిలోనే అతి తీవ్రమైనదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# బారాముల్లా ఎంపీకి కస్టడీ పెరోల్

### పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల కోసం మంజూరు

**న్యూఢిల్లీ :** బారాముల్లా ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్ కు పార్లమెంటు బ్జడెట్ సమావేశాల నేపథ్యంలో కస్టడీ పెరోల్ మంజూరైంది. ఉగ్రనిధుల కేసులో నిందితుడైన రషీద్ ప్రస్తుతం ఢిల్లీలోని తిహాడ్ జైలులో ఉన్నారు. జనవరి 28 నుంచి ప్రారంభమవుతున్న పార్లమెంటు బ్జడెట్ సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయనకు అనుమతిస్తూ ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు కస్టడీ పెరోల్ మంజూరు చేసింది. పార్లమెంటు సమావేశాల్లో హాజరయ్యేందుకు తాత్కాలిక బెయిల్ కానీ, కస్టడీ పెరోల్ కానీ ఇవ్వాలని రషీద్ ఇటీవల కోర్టును కోరారు. దీనిపై సమాధానం ఇవ్వాలని ఎన్ఐఏకు గతవారం ప్రత్యేక ఎన్ఐఏ జడ్జి ప్రశాంత్ శర్మ నోటీసులు జారీచేశారు. కోర్టు తాజా ఆదేశాలపై రషీద్ తరఫు న్యాయవాది నిషిత గుప్తా మాట్లాడుతూ, బ్జడెట్ సమావేశాలు జరిగే జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకూ అన్ని రోజులూ హాజరయ్యేందుకు కోర్టు అనుమతించిందని చెప్పారు. పార్లమెంటు సెక్యూరిటీతో పాటు పోలీసు సెక్యూరిటీతో ఈ సమావేశాలకు రషీద్ హాజరవుతారని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రనిధుల కేసుకు సంబంధించి 2019లో రషీద్‌ను అరెస్టు చేశారు. విచారణలో ఉండగానే ఆయన 2024 లోక్‌సభ ఎన్నికల్లో బారాముల్లా నియోజకవర్గం నుంచి పోటీ చేసి నేషనల్ కాన్ఫరెన్స్ నేత, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాపై 2 లక్షల పైచిలుకు ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కాగా, రెండు విడతల బ్జడెట్ సమావేశాల్లో భాగంగా తొలివిడత జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకూ జరుగుతుంది. తిరిగి మార్చి 9న ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తుంది. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు పార్లమెంటులో బ్జడెట్ సమర్పణ జరుగుతుంది.

# చైనాకు బలైపోతావ్ జాగ్రత్త!

### కెనడాను హెచ్చరించిన ట్రంప్



**వాషింగ్టన్ :** మిసైల్ రక్షణ వ్యవస్థ గోల్డెన్న్ డోమ్ ఏర్పాటు ప్రతిపాదనలను కెనడా వ్యతిరేకిస్తుండటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదో ఒక రోజు కెనడా చైనాకు బలైపోతుందని వ్యాఖ్యానించారు. చైనాతో దౌత్య, వాణిజ్య బంధాల బలోపేతానికి కెనడా ప్రయత్నిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ హెచ్చరిక చేయడం గమనార్హం. గ్రీన్‌లాండ్‌కు రక్షణగా గోల్డెన్ డోమ్ ఏర్పాటును కెనడా వ్యతిరేకిస్తోంది. కెనడాకూ ఈ వ్యవస్థతో రక్షణ లభించే అవకాశం ఉన్నా అడ్డుకుంటోంది. ఇది చాలదన్నట్టు వారు చైనాతో వాణిజ్యానికి మొగ్గుచూపుతున్నారు. ఒప్పందం కుదిరిన మొదటి సంవత్సరం లోనే వారు చైనాకు ఆహారమైపోతారని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ హెచ్చరించారు. అమెరికా భద్రతకు గ్రీన్‌లాండ్ కీలకంగా మారిందని చెబుతున్న ట్రంప్ అక్కడకు కూడా గోల్డెన్ డోమ్ రక్షణను విస్తరిస్తామని చెబుతున్నారు. అయితే, కెనడా మాత్రం ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. గోల్డెన్ డోమ్ ప్రతిపాదన తమ ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేలా ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. చైనాతో వాణిజ్య సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు కూడా కెనడా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కెనడా, అమెరికాల మధ్య కొంత కాలంగా అసలేమాత్రం పొసగని విషయం తెలిసిందే. ఇక దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశాల్లో ఇరు దేశాల మధ్య ఎడం మరింత పెరిగింది. ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వ తీరును కెనడా ప్రధాని కార్నీ ఎండగట్టారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ నియమాలకు కాలం చెల్లినట్టు కనిపిస్తోందని అన్నారు. దీంతో, ట్రంప్ కూడా అంతేఘాటుగా స్పందించారు. ఇంతకాలం అమెరికా ఇచ్చే అనేక ఉచితాలను అనుభవించిన కెనడా కాస్తంత కృతజ్ఞతతో మసులుకోవాలని అన్నారు. కానీ వారిలో కృతజ్ఞత కనిపించట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తను ప్రతిపాదించిన గో÷–డలెన్ డోమ్‌తో కెనడాకు కూడా రక్షణ లభిస్తుందని అన్నారు. మిసైల్ దాడుల నుంచి రక్షణ కోసం అమెరికా ప్రభుత్వం గతేడాది తొలిసారిగా ఈ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ ఏర్పాటు చేసుకున్న ఐరోన్ డోమ్ వ్యవస్థ స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. మొదట్లో దీన్ని ఐరన్ డోమ్ ఆఫ్ అమెరికాగా మీడియాలో పేర్కొన్నప్పటికీ ఆ తరువాత ప్రభుత్వం గో÷–డలెన్ డోమ్‌గా పేరు మార్చింది. ఇందుకు అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని కెనడా ప్రభుత్వం భరిస్తే ఆ దేశానికి రక్షణ కల్పిస్తామని తెలిపింది.

# గింజలను తినడం లేదా.. అయితే మీరు ఈ లాభాలను కోల్పోయినట్లే..!



మన శరీర ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తి పనితీరుకు, శక్తి స్థాయిలకు, శరీర అవసరాలకు పోషకాలు చాలా అవసరం. ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్స్, విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల దీర్ఘకాల అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి. మానసిక స్థితితో పాటు శారీరక పనితీరు మెరుగుపడుతుంది. మన శరీరానికి అవసరమయ్యే పోషకాలు ఉండే ఆహారాల్లో గింజలు కూడా ఒకటి. ఇవి పోషకాలకు శక్తివంతమైన వనరు అని చెప్పవచ్చు. గింజల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్, ఫైబర్, విటమిన్ బి, ఇ లతో పాటు మెగ్నీషియం, జింక్, పొటాషియం వంటి ఎన్నో పోషకాలు ఎన్నో ఉంటాయి. గింజలను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. ఆహారంలో భాగంగా గింజలను తీసుకోవడం వల్ల మనం పోషకాహార లోపాన్ని చాలా వరకు తగ్గించవచ్చు.

### గుండె ఆరోగ్యానికి..

వీటిలో ఒమెగా 3, ఒమెగా 6 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయడపడతాయి. గింజలను తీసుకోవడం వల్ల మెదడు పనితీరుతో పాటు అభిజ్ఞా పనితీరు మెరుగుపడుతుంది. గింజల్లో ఉండే ఫైబర్ మనకు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. తద్వారా మనం తక్కువ ఆహారాన్ని తీసుకునే వీలు కలుగుతుంది. బరువు తగ్గడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో దోహదపడతాయి. అలాగే గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉ ంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. తద్వారా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి. గింజలను తీసుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. పిత్తాశయ ఆరోగ్యం మెరుగుపరుస్తుంది. పిత్తాశయ రాళ్ల ప్రమాదం తగ్గుతుంది.

### గ్యాస్ సమస్యకు చెక్..

గింజలను తీసుకోవడం వల్ల యాసిడ్ రిఫ్లెక్షన్ సమస్య తగ్గుతుంది. పెద్ద పేగు క్యాన్సర్ ప్రమాదం కూడా తగ్గుతుంది. గింజల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వృద్ధాప్య ఛాయలను తగ్గించడంలో దోహదపడతాయి. ఇలా గింజలు మనకు అనేక రకాలుగా మేలు చేసినప్పటికీ వీటిని తగిన మోతాదులో తీసుకోవడం చాలా అవసరం. ఎందుకంటే వీటిలో క్యాలరీలు అధికంగా ఉంటాయి. కనుక రోజూ ఒక గుప్పెడు మోతాదులో మాత్రమే వీటిని తీసుకోవాలి. అలాగే నూనె, చక్కెర, ఉప్పు వంటి వాటిని జోడించని గింజలను మాత్రమే తీసుకోవాలి. వీటిని నానబెట్టి తీసుకోవడం వల్ల మనం అధిక ప్రయోజనాలను పొందవచ్చు.


### వివిధ రకాలుగా తీసుకోవాలి..

రోజూ ఒకేరకం గింజలు కాకుండా బాదం, వాల్‌నట్స్, జీడిపప్పు, పిస్తా, బ్రెజిల్ నట్స్ ఇలా అన్ని రకాల గింజలను తీసుకునే ప్రయత్నం చేయాలి.

ఇక ఈ గింజలను పెరుగు, ఓట్ మీల్, సలాడ్ వంటి వాటితో కలిపి తీసుకోవడం వల్ల మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయి. రోజువారీ ఆహారంలో గింజలను చేర్చుకోవడం వల్ల శరీరానికి కావల్సిన పోషకాలు అందుతాయి. వీటిని తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను సొంతం చేసుకోవచ్చు.

# అలసట తగ్గాలంటే వీటిని తినండి.. ఫుల్ యాక్టివ్ అవుతారు..!

ఈ రోజుల్లో అలసట, నీరసం చాలా మందిని వేధిస్తున్న సమస్య. ఉదయం లేచినప్పటి నుంచే బద్ధకంగా అనిపించడం, చిన్న పని చేసినా అలసిపోవడం, రోజంతా ఉత్సాహంగా లేకపోవడం.. ఇవన్నీ సాధారణమైపోయాయి. అయితే అలసట ఎందుకు వస్తుంది? అలసట తగ్గాలంటే ఏం తినాలి? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..



అలసట అనేది సరిపడా నిద్ర లేకపోవడం, ఒత్తిడి, సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల వస్తుంది. అలాగే తక్కువ నీరు తాగడం, వ్యాయామం చేయకపోవడం, ఎక్కువగా జంక్ ఫుడ్ తినడం వంటి జీవనశైలి సమస్యల వల్ల కూడా రావచ్చు. ఇవన్నీ శరీర శక్తిని తగ్గిస్తాయి. అంతేకాకుండా.. రక్తహీనత , విటమిన్ లోపాలు , డిప్రెషన్ వంటి ఆరోగ్య సమస్యలు, కొన్ని మందుల వాడకం, దీర్ఘకాలిక వ్యాధులు, అధిక పనిభారం లేదా శారీరక శ్రమ వంటి కారణాల వల్ల కూడా వస్తుంది. అయితే సరైన ఆహారం తీసుకుంటే అలసట తగ్గి శరీరం ఫుల్ యాక్టివ్‌గా మారుతుంది.

### అలసట తగ్గాలంటే ఇవి తినండి.!

అరటిపండులో సహజ చక్కెర, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరానికి వెంటనే శక్తినిస్తాయి. ఉదయం లేదా వ్యాయామానికి ముందు అరటిపండు తింటే అలసట త్వరగా తగ్గుతుంది.

ఖర్జూరం: తక్షణ శక్తి కావాలంటే ఖర్జూరం బెస్ట్. ఇందులో గ్లూకోజ్, ఐరన్ ఎక్కువగా ఉ ంటాయి. 2-3 ఖర్జూరాలు తింటే శరీరం యాక్టివ్‌గా మారుతుంది.

గుడ్లు: గుడ్లు ప్రోటీన్‌కు మంచి వనరు. ఇవి కండరాలను బలంగా చేసి రోజంతా శక్తిని నిలబెట్టడంలో సాయపడతాయి. ఉదయం గుడ్డు తింటే అలసట తగ్గుతుంది.

డ్రై ఫ్రూట్స్: బాదం, వాల్నట్, జీడిపప్పు లాంటివి మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. రోజూ ఉదయం 4-5 నానబెట్టిన బాదం తింటే ఉత్సాహం పెరుగుతుంది.

పెరుగు: పెరుగులో ప్రొబయోటిక్స్ ఉంటాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగుపరచి శరీరానికి శక్తిని అందిస్తాయి. ఉదర సమస్యల వల్ల వచ్చే అలసటను తగ్గిస్తాయి.

ఆకుకూరలు: ఇవి ఐరన్, ఫోలేట్‌తో నిండి ఉ ంటాయి. రక్తహీనత వల్ల వచ్చే అలసటను తగ్గించడంలో చక్కగా ఉపయోగపడతాయి.

ఓట్స్: నెమ్మదిగా శక్తిని విడుదల చేసే ఆహారం ఓట్స్. ఉదయం అల్పాహారంగా తింటే ఎక్కువసేపు యాక్టివ్‌గా ఉంటారు.

అలసటను తగ్గించుకోవాలంటే మందుల కంటే ముందుగా ఆహారంపై దృష్టి పెట్టాలి. సరైన పోషకాలున్న ఆహారం తీసుకుంటే శరీరం సహజంగానే ఫుల్ యాక్టివ్‌గా మారుతుంది. అలాగే రోజుకు కనీసం 7--8 గంటలు నిద్రపోవాలి. తగినంత నీరు తాగాలి. ఎక్కువగా జంక్ ఫుడ్ తినకూడదు. రోజూ కనీసం కొద్దిసేపైనా వ్యాయామం చేయాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



# శీతాకాలంలో సైనస్ సమస్యలు ఎందుకు పెరుగుతాయి?

శీతాకాలం వచ్చిందంటే చాలు.. జలుబు, దగ్గు లాగానే చాలా మందిని సైనస్ సమస్యలూ వేధిస్తాయి. కొందరు దీనిని చిన్న సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ సకాలంలో జాగ్రత్తలు తీసుకోకపోతే.. ఇది చెవి ఇన్ఫెక్షన్లు వంటి పెద్ద సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి శీతాకాలంలో సైనసైటిస్ ఎందుకు వస్తుంది? దాన్ని ఎలా నివారించాలి అనే విషయాలు తెలుసుకోవడం చాలా అవసరం.

### సైనసైటిస్ ఎందుకు వస్తుంది?



సైనసైటిస్(రాఱఅబంఊఅం) ప్రధానంగా వైరల్, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, అలర్జీలు, సైనస్ మార్గాలలో వాపు లేదా అడ్డంకుల వల్ల వస్తుంది. జలుబు, ఫ్లూ, నాసికా పాలిప్స్, దంత సమస్యలు, ధూమపానం వంటి కారణాల వల్ల సైనస్లు(ముక్కులో ఉండే గాలి గదులు) వాచి, శ్లేష్మం పేరుకుపోవడం వల్ల ఈ ఇన్ఫెక్షన్ సోకుతుంది.

శీతాకాలంలో వాతావరణం చల్లగా, పొడిగా ఉ ంటుంది. దీనివల్ల ముక్కులోని లోపలి(శ్లేష్మ) పొర) పొడిబారుతుంది. అప్పుడు సైనస్ గదుల్లో శ్లేష్మం సరిగా బయటకు రావడం కష్టమవుతుంది. ఫలితంగా ముక్కు దిబ్బడ, తలనొప్పి, ముఖం చుట్టూ నొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవే సైనసైటిస్ లక్షణాలు.

ఇంకా జలుబు, ఫ్లూ వల్ల శరీర రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. అప్పుడు చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద సమస్యగా మారుతుంది. సైనస్ సమస్యను పట్టించుకోకుండా వదిలేస్తే, అది చెవి ఇన్ఫెక్షన్‌గా మారే ప్రమాదమూ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ముక్కులో శ్లేష్మం ఎక్కువగా పేరుకుపోతుంది. అది పొరలా మారి నాసికా మార్గాలను మూసేస్తుంది. అలాంటి పరిస్థితుల్లో చికిత్స ఆలస్యమైతే పరిస్థితులు శస్త్రచికిత్సకూ దారితీసే అవకాశముంది.

### ఈ సమస్య ఎవరికీ ఎక్కువగా వస్తుంది?

❖ తరచూ సైనస్ సమస్యలతో బాధపడేవారు ❖ అలర్జీలు ఉన్నవారు ❖ ఉబ్బసం(ఆస్తమా) ఉన్నవారు ❖ తరచూ జలుబు వచ్చే వారు ❖ పొగతాగే అలవాటు ఉన్నవారు ❖ సైనస్ సమస్యలు రాకుండా ఉండాలంటే? ❖ చల్లని గాలి వీస్తున్నప్పుడు బయటకు వెళ్తే ముక్కు, చెవులను కప్పుకోండి. ❖ శరీరంలో శ్లేష్మం పలుచగా ఉండేందుకు రోజూ ఎక్కువగా నీరు తాగండి.
❖ దుమ్ము, పొగ, అలర్జీ కలిగించే పదార్థాలకు దూరంగా ఉండండి. ❖ ముక్కు దిబ్బడ, చెవి నొప్పి, తల తిరగడం వంటి లక్షణాలు కొన్ని రోజులు కొనసాగితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి.

## తక్కువ తిన్నా బరువు పెరుగుతున్నారా?
# అసలు కారణం తెలుసుకోండి.!

మీరు చాలా తక్కువగా తింటున్నా బరువు పెరుగుతుంటే.. దాన్ని ఏమాత్రం తేలికగా తీసుకోకండి. ఇది శరీరంలో ఏదైనా సమస్యకు సంకేతం కావచ్చు. ముఖ్యంగా జీవక్రియ(మెటబాలిజం) నెమ్మదిగా ఉండటం వల్ల కూడా ఇలా జరగవచ్చు. చాలా మంది లావు అవుతామనే భయంతో తక్కువగా తింటుంటారు. చక్కెర, కొవ్వు పదార్థాలనూ తగ్గిస్తారు. అయినా బరువు తగ్గకుండా పెరుగుతూనే ఉంటే.. ఈ సమస్యకు తప్పకుండా కారణం తెలుసుకోవాలి.




ఆరోగ్య నిపుణుల ప్రకారం.. 40 ఏళ్ల తర్వాత చాలా మందిలో జీవక్రియ నెమ్మదిస్తుంది. అప్పుడు శరీరం కేలరీలను సరిగ్గా కరిగించలేకపోతుంది. తక్కువ తిన్నప్పటికీ కొవ్వు పేరుకుపోతుంది. దీని వల్ల బరువు పెరుగుతుంది, ఊబకాయమూ వచ్చే అవకాశం ఉంటుంది.

### హార్మోన్ల సమస్య..

తక్కువ తిన్నా బరువు పెరగడానికి హార్మోన్ల అసమతుల్యత కూడా ప్రధాన కారణం. ఇది ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్(ూజుూ) రుతువిరతి(మోనోపాజ్), గర్భధారణ తర్వాత హార్మోన్ల మార్పులు వంటి కారణాల వల్ల బరువు పెరగవచ్చు. వయస్సు పెరిగే కొద్దీ ఈ సమస్యలు ఎక్కువ అవుతుంటాయి.

సాధారణంగా కొంతమంది ఆహారం సరిగ్గా తీసుకోరు. అంటే వారు అవసరమైన దానికంటే తక్కువ తింటారు లేదా ఎక్కువసేపు ఆకలితో ఉంటారు. అలాంటి సందర్భాలలో శరీరం కొవ్వును కరిగించదు. కానీ దానిని నిల్వ చేయడం ప్రారంభిస్తుంది. కాబట్టి ఈ రకమైన అలవాట్లు బరువు పెరగడానికి దారితీస్తాయి. అలాగే స్టెరాయిడ్ మందులు తీసుకునే వారిలో ఈ రకమైన సమస్య కనిపిస్తుంది.

### బరువు పెరగకుండా ఉండాలంటే..

సమతుల్య ఆహారం తీసుకోండి. ఎట్టి పరిస్థితుల్లోనూ తక్కువ తినకండి.
ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయండి.
7-8 గంటలు నిద్రపోండి. మానసిక ఒత్తిడిని తగ్గించడానికి యోగా లేదా ధ్యానం చేయండి.
ఇలా చేస్తే బరువు నియంత్రణలో ఉంటుంది, ఆరోగ్యమూ మెరుగ్గా ఉంటుంది.

# శాంసన్ స్థానాన్ని ఇషాన్ భర్తీ చేసే అవకాశం

భారత స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ దాదాపు 3 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జట్టులోకి తిరిగి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇషాన్ కిషన్ టీమిండియాలో భాగమయ్యాడు. మొదటి టీ20 మ్యాచ్‌లో విఫలమయ్యాడు, కానీ రెండవ టీ20లో అద్భుతమైన బ్యాటింగ్ చేశాడు. అతడి ఇన్నింగ్స్ సాధారణమని కొట్టిపారేయలేం. ఎందుకంటే ఇలాంటి ఇన్నింగ్స్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మీద ఒత్తిడి పెంచుతాయి. జట్టులో అసలుసిసలైన వికెట్ కీపర్ బ్యాటర్ కోసం టీమిండియా చాలా ఏళ్ల నుంచి వెతుకుతోంది. మరోవైపు వీరిద్దరూ టీ20 వరల్డ్ కప్ కోసం ఎంపికైన ఆటగాళ్లు. కనుక శాంసన్ విఫలం కావడంతో బీసీసీఐ వరల్డ్ కప్ లో ఇషాన్ కిషన్ కు ఛాన్స్ ఇవ్వనుందని ప్రచారం జరుగుతోంది. శుక్రవారం రాయ్‌పూర్‌లో జరిగిన సిరీస్‌లోని రెండవ టీ20లో ఇషాన్ కిషన్ కేవలం 32 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సర్ల సహాయంతో 76 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు, సంజూ శాంసన్ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లలోనూ విఫలమయ్యాడు. అతను 2 మ్యాచ్‌లలో వరుసగా 10, 06 పరుగులు చేశాడు. ఇషాన్ ఈ ఇన్నింగ్స్ 2026 టీ20 ప్రపంచ కప్ లో జట్టు ఈక్వెషన్‌ను మార్చే అవకాశం ఉంది. ఇంకా చెప్పాలంటే వికెట్ కీపర్ బ్యాటర్ స్థానానికి తుది జట్టులో రేసులో ఉన్నానని ఇషాన్ కిషన్ సంకేతాలు ఇచ్చాడు. మరోవైపు శాంసన్ వరుస మ్యాచ్ లలో విఫలమవుతూ ఏదో రోజు పెద్ద ఇన్నింగ్స్ ఆడతాడని విమర్శలు సైతం ఉన్నాయి. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ ఇద్దరూ టీ20 ప్రపంచ కప్ కోసం ఎంపికైన ఇండియా ఆటగాళ్లు అని తెలిసిందే. పొట్టి ప్రపంచ కప్ కంటే ముందు భారత్ ఆడే సిరీస్ న్యూజిలాండ్‌తో జరుగుతోంది. ఈ టీ20 సిరీస్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లలో ఇషాన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. రెండవ టీ20లో ఇషాన్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఓపెనింగ్ చేసేందుకు శాంసన్‌కు గట్టి పోటీ ఇస్తున్నాడు. ఈ ఫామ్‌తో ఇషాన్ కిషన్ టీ20 ప్రపంచ కప్‌లో ఓపెనింగ్‌లో అభిషేక్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేయవచ్చు. లేదా శాంసన్ ను పక్కనపెట్టి ఇషాన్ కిషన్‌కు తుది జట్టులో అవకాశం వచ్చినా ఆశ్చర్యం అక్కర్లేదు. ఇషాన్ ఓపెనింగ్‌కు వస్తే, మిడిల్ ఆర్డర్‌లో శాంసన్‌కు చోటు కష్టం కావచ్చు. ఇషాన్ కిషన్ కూడా వికెట్ కీపర్, దీని కారణంగా సంజుకు సరైన ప్రత్యామ్నాయంగా మారవచ్చు. ఈ పరిస్థితిలో శాంసన్ ప్రతి మ్యాచ్‌లోనూ రాణించక తప్పదు. రాబోయే ప్రపంచ కప్‌లో మరోసారి సంజూకు అవకాశాలు సన్నగిల్లే ఛాన్స్ ఉంది. 2024 టీ20 ప్రపంచ కప్‌లో కూడా సంజూ గురించి ఆలోచించినా పంత్ ఫాం, ఆటను చూసి అతడికి ఛాన్స్ ఇచ్చి, శాంసన్‌ను బెంచ్‌కు పరిమితం చేశారు. ఆ టోర్నమెంట్‌లో ఏ మ్యాచ్‌లోనూ ప్లేయింగ్ 11లో భాగం కాలేదు. ఇషాన్ కిషన్ డాషింగ్ ఇన్నింగ్స్ ఆడగలడు. టీ20 ఇంటర్నేషనల్ కెరీర్ లో ఇప్పటివరకు 34 మ్యాచ్‌లు ఆడాడు. ఈ మ్యాచ్‌లలోని 34 ఇన్నింగ్స్‌లలో 34 సగటుతో 129.98 స్ట్రైక్ రేట్‌తో 880 పరుగులు చేశాడు. ఇందులో 7 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఒకవేళ రైట్, లెఫ్ట్ కాంబినేషన్ కోసం చూస్తే మాత్రం సంజూ, అభిషేక్ ఓపెనింగ్ చేస్తారు. ఇషాన్ ఫాం ఇలాగే కొనసాగిస్తే అభిషేక్‌తో కలి ఇషాన్ ఓపెనింగ్ చేసినా ఆశ్చర్యం అక్కర్లేదు.



# ఒకే మ్యాచ్‌లో 5 ప్రపంచ రికార్డులు గల్లంతు




రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లో టీమిండియా సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. న్యూజిలాండ్ నిర్దేశించిన 209 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా కేవలం 15.2 ఓవర్లలోనే ఊదేశింది. సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ బ్యాట్‌లతో విరుచుకుపడటంతో మైదానంలో పరుగుల వరద పారింది. ఈ మ్యాచ్‌లో గెలుపుతో పాటు ఏకంగా ఐదు భారీ రికార్డులు బద్దలయ్యాయి. కివీస్ బౌలర్లు చుక్కలు చూడగా, భారత బ్యాటర్లు చరిత్ర తిరగరాశారు. భారత యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో ఊచకోత కోశాడు. కేవలం 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి, టీ20ల్లో న్యూజిలాండ్‌పై అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన భారత ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. సరిగ్గా 48 గంటల క్రితమే అభిషేక్ శర్మ (22 బంతుల్లో 50) నెలకొల్పిన రికార్డును ఇషాన్ చెరిపేయడం విశేషం. సాధారణంగా పవర్ ప్లేలో ఓపెనర్లు మాత్రమే హాఫ్ సెంచరీలు సాధిస్తుంటారు. కానీ ఈ మ్యాచ్‌లో సంజు శాంసన్ త్వరగా అవుట్ కావడంతో వన్ డౌన్‌లో వచ్చిన ఇషాన్ కిషన్, పవర్ ప్లే ముగిసేలోపే తన యాభై పరుగులు పూర్తి చేశాడు. తద్వారా పవర్ ప్లేలో హాఫ్ సెంచరీ బాదిన తొలి నాన్ ఓపెనర్ భారత బ్యాటర్‌గా ఇషాన్ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో (ఫుల్ మెంబర్ జట్ల మధ్య) 200 కంటే ఎక్కువ పరుగుల లక్ష్యాన్ని అత్యంత వేగంగా ఛేదించిన జట్టుగా భారత్ నిలిచింది. 209 పరుగుల లక్ష్యాన్ని 28 బంతులు మిగిలి ఉండగానే టీమ్ ఇండియా పూర్తి చేసింది. గతంలో పాకిస్థాన్ (24 బంతులు మిగిలి ఉండగా 205 రన్స్ ఛేజ్) పేరిట ఉన్న రికార్డును భారత్ బద్దలు కొట్టింది. న్యూజిలాండ్ బౌలర్ జాక్ ఫౌల్క్స్ కు ఈ మ్యాచ్ ఒక పీడకల. కేవలం 3 ఓవర్లలోనే 67 పరుగులు సమర్పించుకున్నాడు. టీ20 క్రికెట్ చరిత్రలో ఒక కివీస్ బౌలర్ ఒకే మ్యాచ్‌లో ఇన్ని పరుగులు ఇవ్వడం ఇదే మొదటిసారి. 2018లో బెన్ వీలర్ (64 పరుగులు) పేరిట ఉన్న చెత్త రికార్డును ఫౌల్క్స్ తన ఖాతాలో వేసుకున్నాడు. భారత పేసర్ అర్షదీప్ సింగ్ కూడా ఒక అవాంఛనీయ రికార్డును మూటగట్టుకున్నాడు. మ్యాచ్‌లోని తొలి ఓవర్‌లోనే 18 పరుగులు ఇచ్చి, టీ20ల్లో మొదటి ఓవర్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన భారత బౌలర్‌గా నిలిచాడు. గతంలో 2022లో ఐర్లాండ్ ప్లేయర్ పాల్ స్టిర్లింగ్ భారత బౌలర్‌పై 18 పరుగులు రాబట్టగా, ఇప్పుడు అర్షదీప్ ఆ రికార్డును సమం చేశాడు.

PCB
Pakistan Cricket Board

## టీ20 ప్రపంచకప్పు నుంచి పాక్ తప్పుకుంటుందా?

టీ-20 ప్రపంచకప్పు నుంచి బంగ్లాదేశ్‌ను తప్పిస్తూ ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) తప్పుబట్టింది. అందుకు నిరసనగా టోర్నీని బహిష్కరించాలని యోచిస్తోంది. ప్రపంచకప్పులో పాల్గొనడంపై తమ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ వెల్లడించారు. టోర్నీని బహిష్కరించాలా, లేదా పాల్గొనాలా అనే విషయాన్ని తమ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముందు ఉంచుతామన్నారు. ప్రస్తుతం ప్రధాని స్వదేశంలో లేరని, వచ్చాక ఆయన సలహా తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని నఖ్వీ స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వద్దంటే అప్పుడు ఐసీసీ మరో జట్టును ఆహ్వానిస్తుందని విమర్శించారు. ప్రపంచ క్రికెట్‌లో బంగ్లాదేశ్ పెద్ద వాటాదారు అని, ఆ జట్టుకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఐసీసీ పక్షపాత నిర్ణయాలు తీసుకుందని నఖ్వీ ఆక్షేపించారు. పాకిస్థాన్, భారత్ కోసం వేదికలను మార్చి వారికి అనుకూలంగా వ్యవహరించినప్పుడు, బంగ్లాదేశ్ విషయంలో అలా ఎందుకు చేయలేదని నఖ్వీ ప్రశ్నించారు.

# స్మృతి మంధాన పెళ్లి రద్దుపై సంచలన ఆరోపణలు



టీమిండియా మహిళా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్ పెళ్లి రద్దు కావడం వెనుక అత్యంత దిగ్భ్రాంతికరమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంపై స్మృతి బాల్య మిత్రుడు విధాన మానే చేసిన సంచలన ఆరోపణలు ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. నవంబర్ 23, 2025న మహారాష్ట్రలోని సాంగ్లీలో స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్‌ల వివాహం ఘనంగా జరగాల్సి ఉంది. కానీ పెళ్లి రోజే ముహూర్తం ఆగిపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అప్పట్లో స్మృతి తండ్రికి ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రిలో చేరడం వల్లే పెళ్లి వాయిదా పడిందని భావించారు. కానీ అసలు కారణం అది కాదని, పలాష్ ముచ్చల్ మోసం చేయడమేనని ఇప్పుడు తేలింది. స్మృతి మంధాన చిన్ననాటి స్నేహితుడు విధాన మానే ఓ ఇంటర్వ్యూలో పలాష్‌పై సంచలన ఆరోపణలు చేశారు. "పెళ్లి వేడుకలు జరుగుతున్న సమయంలో పలాష్ మరో మహిళతో కలిసి పడకగదిలో రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయాడు. ఆ దృశ్యాన్ని చూసి మేమంతా షాక్ అయ్యాం. ఆ సమయంలో అక్కడ ఉన్న భారత మహిళా క్రికెటర్లు ఆగ్రహంతో పలాష్‌ను చితకబాదారు" అని విధాన మానే వెల్లడించారు. కేవలం స్మృతిని మోసం చేయడమే కాకుండా, పలాష్ తన దగ్గర నుంచి కూడా భారీగా డబ్బులు వసూలు చేశాడని విధాన మానే ఆరోపించారు. ఒక సినిమా నిర్మిస్తానని చెప్పి పలాష్ తన దగ్గర రూ. 40 లక్షలు తీసుకున్నాడని, కానీ ఇప్పటివరకు సినిమా తీయలేదని, డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. పెళ్లి రద్దు అయినప్పటి నుంచి పలాష్ తన ఫోన్ కాల్స్ ఎత్తడం లేదని, అతను ఓ పెద్ద మోసగాడని విధాన మానే మండిపడ్డారు. స్మృతి మంధాన కుటుంబం ఈ ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. పలాష్ పెళ్లి చేసుకుని సాంగ్లీలోనే స్థిరపడతాడని తాము ఆశించామని, కానీ అతని అసలు స్వరూపం బయటపడటంతో స్మృతి తండ్రి మనస్తాపానికి గురై అనారోగ్యం పాలయ్యారని సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం స్మృతి ఈ చేదు జ్ఞాపకాల నుంచి కోలుకోవడానికి ప్రయత్నిస్తోంది.

# మళ్లీ రెచ్చిపోయిన హార్దిక్




టీమిండియా ఆటగాళ్లు మైదానంలో ఎంత దూకుడుగా ఉంటారో, కొన్నిసార్లు మైదానం బయట కూడా అంతే వేడిని ప్రదర్శిస్తుంటారు. తాజాగా రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20కి ముందు హార్దిక్ పాండ్యాకు సంబంధించిన ఒక వీడియో చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు హార్దిక్ ప్రాక్టీస్ కోసం మైదానంలోకి వస్తున్న సమయంలో, అక్కడ ఉన్న కామెంటేటర్ మురళీ కార్తీక్‌తో ఏదో విషయంలో వాగ్వాదానికి దిగాడు. మొదట సాధారణంగా మొదలైన వీరి సంభాషణ, కొద్దిసేపటికే సీరియస్ చర్చగా మారింది. హార్దిక్ ముఖ కవళికలు చూస్తుంటే అతను చాలా కోపంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. వైరల్ అవుతున్న వీడియోను గమనిస్తే.. హార్దిక్ మాట్లాడుతూ దూరం వెళ్లిపోవడం, మళ్ళీ వెనక్కి వచ్చి మురళీ కార్తీక్ దగ్గర నిలబడి గట్టిగా ఏదో చెప్పడం కనిపిస్తుంది. మురళీ కార్తీక్ కూడా తన వాదనను వినిపించడానికి ప్రయత్నించినప్పటికీ, హార్దిక్ ఏమాత్రం తగ్గలేదు. ఈ వీడియోను షేర్ చేసిన క్రికెట్ సెంట్రల్ అనే ఎక్స్ ఖాతా.. "రాయ్‌పూర్‌లో రెండో టీ20 ప్రారంభానికి ముందు హార్దిక్ పాండ్యా, మురళీ కార్తీక్ మధ్య పెద్ద గొడవ జరిగింది" అని పేర్కొంది. అయితే ఈ గొడవకు గల అసలు కారణం ఏమిటనేది మాత్రం ఇంకా అధికారికంగా తెలియలేదు. కేవలం అది సరదా చర్చా లేక నిజంగానే విభేదాలా అన్నదానిపై స్పష్టత లేదు. మరోవైపు న్యూజిలాండ్ సిరీస్‌లో హార్దిక్ పాండ్యా తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. నాగ్‌పూర్‌లో జరిగిన తొలి టీ20లో బ్యాట్‌తో 25 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో ఒక వికెట్ తీశాడు. ఇక రాయ్‌పూర్‌లో జరిగిన రెండో టీ20లో టీమ్ ఇండియా టాప్ ఆర్డర్ బ్యాటర్లు లక్ష్యాన్ని త్వరగా ముగించడంతో హార్దిక్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కానీ, బౌలింగ్‌లో ఒక కీలక వికెట్ పడగొట్టి తన వంతు సహకారం అందించాడు. ఈ గొడవ వీడియోపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు హార్దిక్ వైఖరిని తప్పుపడుతుంటే, మరికొందరు మురళీ కార్తీక్ ఏమైనా అనవసరమైన ప్రశ్నలు అడిగి ఉంటారా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా హార్దిక్ మైదానంలో తన సహచర ఆటగాళ్లపై, ప్రత్యర్థులపై కోపం ప్రదర్శించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఒక సీనియర్ మాజీ క్రికెటర్‌తో ఇలా వ్యవహరించడం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ వివాదంపై అటు హార్దిక్ కానీ, ఇటు మురళీ కార్తీక్ కానీ ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు.

## ఏప్రిల్ 10న స్వయంభు విడుదల



యంగ్ అండ్ డైనమిక్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోయే అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'స్వయంభూ' విడుదల తేదీని చింత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా విడుదలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది వేసవి కానుకగా, ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ పాన్-ఇండియా చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా కోసం నిఖిల్ పడుతున్న శ్రమ అంతా ఇంతా కాదు. ఒక యోధుడి పాత్రలో పరకాయ ప్రవేశం చేయడానికి ఆయన తన శరీరాకృతిని పూర్తిగా మార్చుకున్నారు. కేవలం ఫిజిక్ మాత్రమే కాకుండా, యుద్ధ సన్నివేశాల్లో సహజత్వం కోసం విదేశాల్లో కత్తిసాము, గుర్రపు స్వారీ ,విలువిద్యలో ప్రత్యేక శిక్షణ పొందారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో విజువల్స్ హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటాయని సమాచారం. అయితే తాజాగా నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లింప్స్ ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సినిమాపై అంచనాలను మరో మెట్టు ఎక్కించింది. ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న ఈ చారిత్రక గాథ తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.

# బాలకృష్ణ, గోపీచంద్ కాంబినేషన్‌లో 111వ సినిమా

## మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు ప్లాన్





నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్ అంటేనే బాక్సాఫీస్ వద్ద మాస్ జాతర మొదలైనట్లే. 'వీరసింహా రెడ్డి' వంటి భారీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న 111వ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ విషయంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న సస్పెన్స్‌కు ఇప్పుడు తెరపడింది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను సుమారు రూ.170 కోట్ల భారీ బ్జడెట్‌తో ఒక చారిత్రక నేపథ్యం ఉన్న కథతో చేయాలనుకున్నారు. కానీ, ప్రస్తుతం మారిన మార్కెట్ పరిస్థితులు, బ్జడెట్ లెక్కల దృష్ట్యా ఆ కథను పక్కన పెట్టి, బాలయ్య ఇమేజ్‌కు సరిపోయే పక్కా మాస్ యాక్షన్ కథను గోపీచంద్ సిద్ధం చేశారు. ఇటీవలే దర్శకుడు వినిపించిన ఈ కొత్త కథకు బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, వచ్చే మార్చి నెల నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ 'వృద్ధి సినిమాస్' ధృవీకరించింది. తొలి షెడ్యూల్‌లోనే బాలయ్య మార్క్ అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ఇక హీరోయిన్ విషయానికి వస్తే, పాత కథ ప్రకారం నయనతారను ఎంపిక చేసినప్పటికీ, ఇప్పుడు కథ మారడంతో ఆమెనే కొనసాగిస్తారా లేక కొత్త హీరోయిన్‌ను తీసుకుంటారా అనే దానిపై సస్పెన్స్ నెలకొంది. ఏదేమైనా, బాలయ్య మార్క్ పవర్‌ఫుల్ డైలాగులు, గోపీచంద్ టేకింగ్ కలిసి మరోసారి బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



### స్నేహానికి మించి అడుగు వేయాలి.. మనసు విప్పిన దిశా పటానీ

సీకే బ్యూటీ దిశా పటానీ ఏం చేసినా అది సంచలనంగానే మారుతుంది. దిశా తన ప్రియుడు టైగర్ ష్రాఫ్ నుంచి విడిపోయిన తర్వాత కూడా తన స్నేహాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఇప్పడు టైగర్ గురించి దిశా పటానీ ఓపెనవ్వడం చర్చగా మారింది. దిశా తన మనసులోని మాటను ఇంత బహిరంగంగా చెప్పడం నిజంగా ఆశ్చర్యకరం. దిశా నిజాయితీకి నిదర్శనం! ఎట్టకేలకు ఈ అమ్మడు తన మనసులోని మాటను బయటపెట్టింది. టైగర్ ష్రాఫ్ గురించి దిశా ఇంతకీ ఏం చెప్పింది? దిశా ఎన్నడూ లేనంత ఇదిగా ఎమోషనల్‌గా మాట్లాడింది ఈసారి. జిమ్నాస్టిక్స్ నేర్చుకోవడం, ఫైర్ రింగ్‌ల నుండి ఫ్లిప్స్ చేయడం వంటివి కేవలం సినిమాల కోసమే కాదు, టైగర్‌ను ఇంప్రెస్ చేయడానికి కూడా అని దిశా చెప్పింది. తన మాట తీరు చూస్తుంటే, వారి మధ్య ఉన్న బంధం ఎంత ఘాఢమైనదో అర్థం చేసుకోవచ్చు. చాలా సంవత్సరాలుగా వీరిద్దరూ -కేవలం మంచి స్నేహితులం- అని ఇంటర్వ్యూలలో చెప్పుకుంటూ వచ్చారు. కానీ దిశా ఇప్పుడు దానిని -ఐస్ బ్రేక్-లా బ్రేక్ చేయాలని, స్నేహానికి మించి తదుపరి అడుగు వేయాలని స్పష్టంగా కోరుకుంటున్నట్టు తన మాటలు చెబుతున్నాయి. టైగర్ ష్రాఫ్ తన ప్రశాంత స్వభావం వల్ల చాలా నెమ్మదిగా ఉన్నాడని, త్వరగా ఏ నిర్ణయమూ చెప్పడని దిశా మాటలను బట్టి అర్థమవుతోంది. టైగర్ స్వతహాగా మార్షల్ ఆర్ట్స్, ఫిట్‌నెస్‌లో ఎవరికీ అందనంత ఎత్తులో ఉంటారు. బహుశా అందుకే దిశా ఎన్ని ఫీట్లు చేసినా ఆయనకు అవి -సాధారణంగా- అనిపిస్తున్నాయేమో! కానీ దిశా ప్రయత్నం మాత్రం అమోఘం. కేవలం ఒక వ్యక్తి కోసం తన ప్రాణాలకు తెగించి ఫైర్ రింగ్ ఫ్లిప్స్ చేయడం అంటే అది మామూలు విషయం కాదు. ఇప్పుడు టైగర్ ఏం చేయాలి? అంటే అతడు కూడా మనసు విప్పి మాట్లాడాలి. తన స్నేహితురాలి మనసును అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి. దిశా తన -ప్రేమ హక్కు- కోసం ధైర్యంగా గొంతు విప్పినట్టే టైగర్ కూడా మనసు విప్పాలి. మార్చి రిలీజ్ డెడ్ లైన్ కోసం.. పవన్ కళ్యాణ్ సినిమా కోసం హరీష్ శంకర్ ఎలాగైతే స్పీడ్ అప్ అవ్వాలో, దిశా మనసు గెలుచుకోవడానికి టైగర్ కూడా కొంచెం -స్పీడ్ అప్- అవ్వాల్సిన సమయం వచ్చింది! దిశా పటానీ ఇంతలా ప్రయత్నిస్తున్నా టైగర్ ఇంకా -ఇంప్రెస్- అవ్వకపోవడం వెనుక కారణం ఏమై ఉంటుంది? అతడు ఇంకా దిశాలో ఏవైనా ప్రత్యేక క్వాలిటీస్ ని ఆశిస్తున్నాడా? దిశా ఇంతకుముందు ప్రభాస్ కల్కి 2898 ఏడి చిత్రంలో నటించింది. తదుపరి సీక్వెల్ లో కనిపిస్తుందా లేదా చూడాలి. ఓ రోమియో, వెల్ కం టు ది జంగిల్, అవారపాన్ 2, సంఘమిత్ర చిత్రాలు విడుదలకు రావాల్సి ఉంది.

## నెట్‌ఫ్లిక్స్‌లో 29న ఛాంపియన్ విడుదల



తెలంగాణ రాజకార్లను ఎదురొడ్డిన బైరాన్‌పల్లి గ్రామ కథ ఆధారంగా రోషన్ హీరోగా తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'ఛాంపియన్' గత డిసెంబరులో బాక్సాఫీసు ముందుకొచ్చి మంచి టాక్ తెచ్చుకుంది. ఇందులోని గిరగిరతో పాటు పాటలు హిట్ అయ్యాయి. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'నెట్‌ప్లిక్స్' లో ఈనెల 29 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనస్వర రాజన్, అవంతిక, రచ్చరవి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులోని 'గిర గిర గింగిరాగిరే' పాట విశేషంగా అలరించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రోజులవి. రజాకార్ల దౌర్జన్యాలకు తెలంగాణ పల్లెలన్నీ చిగురుటాకులా వణికిపోతుండగా.. బైరాన్‌పల్లి లాంటి కొన్ని ఊళ్లు మాత్రం వీరోచితంగా పోరాడుతూ అందరిలో స్వాతంత్య కాంక్ష రగిలించే ప్రయత్నం చేస్తుంటాయి. అదే సమయంలో సికింద్రాబాద్‌కు చెందిన ఆంగ్లో ఇండియన్ కుర్రాడు మైఖేల్ సి.విలియమ్స్ (రోషన్) ఫుట్‌బాల్ ఆటగాడిగా ఎంతో పేరు తెచ్చుకుంటాడు. తన ప్రతిభతో ఇంగ్లాండ్ మాంచెస్టర్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ఆడే అవకాశాన్ని అందుకుంటాడు. కానీ, మైఖేల్ తండ్రి నేపథ్యం కారణంగా తను లీగల్‌గా ఆ దేశానికి వెళ్లే దారులు మూసుకుపోతాయి. దీంతో ఎలాగైనా 20 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లేందుకు అక్రమ మార్గం ఎంచుకుంటాడు. కానీ, దారితప్పి బైరాన్‌పల్లికి వెళతాడు? దానికి కారణమేంటి? ఆ ఊరి వాళ్లతో కలిసి రజాకార్లపై పోరుకు ఎందుకు సిద్ధమయ్యాడు? బైరాన్‌పల్లి గ్రామస్థుల పోరాటాన్ని అణగదొక్కి.. వాళ్లను అంతం చేసేందుకు ఖాసిం రజ్వీ రంగంలోకి దింపిన బాబు దేశ్‌ముఖ్ (సంతోష్ ప్రతాప్)తో మైఖేల్‌కు ఉన్న విరోధం ఏంటి? అన్నది మిగతా కథ.


## ధురంధర్‌ను మించిన బోర్డర్-2



దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన 'బోర్డర్ 2' తొలిరోజు కలెక్షన్ల విషయంలో 'ధురంధర్' ను బీట్ చేసింది. శుక్రవారం విడుదలైన 'బోర్డర్ 2' అదే రోజు.. భారతీయ బాక్సాఫీసు వద్ద రూ.32 కోట్లు (నెట్) కలెక్షన్లు రాబట్టింది. 'ధురంధర్' తొలిరోజు కలెక్షన్లు రూ.28.60 కోట్లు మాత్రమే. సన్నీ దేవోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో అనురాగ్ సింగ్ 'బోర్డర్ 2'ను తెరకెక్కించారు. 1971 ఇండో - పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన 'బోర్డర్'కు కొనసాగింపుగా వచ్చింది. ఈ సీక్వెల్ 28 ఏళ్ల తర్వాత వచ్చినా ప్రేక్షకాదరణ పొందడం విశేషం. ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబరు 5న విడుదలైన ఈ సినిమా రూ.1300? కోట్లు రాబట్టింది. అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ చిత్రాల జాబితాలో రెండో స్థానం, అత్యధిక కలెక్షన్లు రాబట్టిన భారతీయ సినిమా లిస్ట్‌లో నాలుగులో స్థానంలో నిలిచింది. తొలిరోజు కలెక్షన్ల హవాని బట్టి ఈ 'ధురంధర్' రికార్డును 'బోర్డర్ 2' అధిగమించే అవకాశాలున్నాయని సినీ వర్గాల టాక్.

### రాజాసాబ్ నుంచి సహనా సహనా వీడియో సాంగ్ విడుదల

సంక్రాంతి కానుకగా బాక్సాఫీసు ముందుకొచ్చిన చిత్రాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కించిన చిత్రమిది. ఇందులోని మెలొడీ 'సహనా సహనా' ఫుల్ వీడియో విడుదలైంది. ప్రభాస్- నిధి అగర్వాల్‌పై రూపొందించిన సాంగ్ ఇది. ఈ చిత్రం మంచి టాక్‌తో ప్రభాస్ మేనరిజాన్ని బాగా ఎలివేట్ చేసింది. మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినమా థియేటర్లలో ఆడుతోంది.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463